# గురు వైభవం



సద్గురు శ్రీ నాన్నగారు

గురువు కృప ఎలా ఉంటుంది అంటే ఇప్పుడు మీరు నిద్రలో ఉన్నారు అనుకోండి. ఒక సింహం మీకు స్వప్నంలోకి వచ్చింది అనుకోండి. ఆ సింహాన్ని చూసి భయం వేసి మనకు మెలుకువ వచ్చేస్తుంది. స్వప్నంలో వచ్చిన సింహము నిజం కాదు, కాని నీకు మెలకువ రావటం నిజం. గురుకృప కూడా ఆ సింహం చేసిన పనే చేస్తుంది. ఆ సింహం ఏమి చేసింది - మామూలు నిద్రలోనుండి నీకు మెలుకువ తీసుకొని వచ్చింది. కాని గురువు యొక్క కృప ఏమి చేస్తుంది అంటే అజ్ఞానమనే నిద్రలోనుండి జ్ఞానంలోనికి తీసుకుని వస్తుంది. నిన్ను అసత్యం లోనుండి సత్యంలోనికి తీసుకొని రావటానికి గురువు యొక్క ఒక్క చూపు చాలు. గురువు చూపు అంటే అది ఆత్మ చూపు. గురువు మీ వంక చూస్తున్నాడు అంటే చూసేది గురువు కాదు. అక్కడ వ్యక్తి కాదు, ఆత్మే చూస్తుంది. మీ హృదయంలో ఉన్న ఆత్మ దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి ఆత్మే చూస్తుంది. మన హృదయంలో ఉన్న నిజం మన అనుభవములోకి రావాలంటే మన ప్రయత్నం అవసరమే. గురువు యొక్క దయలేకుండా కేవలము నీ ప్రయత్నం వల్లనే అది అనుభవంలోనికి రాదు. అంటే నీ ప్రయత్నముతో పాటు గురువు యొక్క అనుగ్రహం ఉండాలి. గురువు నీకు చేసే సహాయము ఇతరులకు తెలియాలి అని ఆయన అనుకోడు. ఆయనకు ఇతరులు లేరు.

మీ మర్యాదలు గురువుకు అక్కరలేదు. మీరు లోపల బాగుపడటం ఆయనకు ముఖ్యం. కొంతమందితో శాంతిగా మాట్లాడతాడు, కొంతమందితో కోపముగా మాట్లాడతాడు, కొంతమందితో హేళనగా మాట్లాడతాడు, ఇలా రకరకాలుగా మాట్లాడినా అదంతా మన మంచికోసమే, మనలను బాగు చేయటం కోసమే మాట్లాడుతున్నాడు అని గ్రహించిన వారు ధన్యులు.

ఒకోసారి మీకు రిపీటెడ్‌గా ఒకే వాసన వస్తూ ఉంటుంది. అది ఎంతో శక్తిమంతముగా ఉంటుంది. అది పోదు అని మనకు అనిపిస్తుంది. మీరు కంగాపడనక్కరలేదు, ఎంత బలీయమైన వాసన అయినా గురువు అనుగ్రహంలో కొట్టుకొని పోతుంది. మీకు ఇంకా వెయ్యి జన్మలు తీసుకొని వచ్చే వాసనలు, సంస్కారములు మీ లోపల ఉన్నా, అవి ఉన్నట్లు మీకు తెలియచేసి, ఈ ఒక్క జన్మలోనే మీ చేత అనుభవింపచేసి వాటిని బయటకు లాగి మిమ్మల్ని పవిత్రులను చేస్తాడు గురువు.

మనలో కొంతమందికి దేహంతో తాదాప్యం ఉంటుంది. కొంతమందికి మనస్సుతో తాదాప్యం ఉంటుంది. ఈ రెండూ కూడా ప్రమాదమే ఎందుచేతనంటే అవి రెండూ మనం కాదు. దేహము నేను అనే బుద్ధి ఉన్నవాడికి కోటిజన్మలు ఎత్తినా, కష్టాలు, నష్టాలు, బాధలు వాడిని విడిచిపెట్టవు. ఏదైతే సత్యమో అది

మనకు తెలియనంతకాలము జన్మలు వస్తూనే ఉంటాయి. జనన మరణ ప్రవాహములో కొట్టుకొని పోవలసినదే. ఎవడో గురువు అనుగ్రమం పొందినవాడు మాత్రమే ఒడ్డుకు వస్తాడు కాని లేకపోతే ఒడ్డుకు వచ్చే అవకాశమే లేదు.

గురువు యొక్క అనుగ్రహము అతి బలీయమైనది. మీరు గురువును ప్రేమిస్తున్నారు అంటే ఎవరినో ప్రేమిస్తున్నారు అని అనుకోవద్దు. మీ హృదయంలో ఉన్న వస్తువును మీరు ప్రేమించుకుంటున్నారు. ప్రతి మనిషికీ తనంటే తనకు ఎక్కువ ఇష్టం. ఎందుకంటే తను ఆత్మ అయి ఉన్నాడు కాబట్టి. ఒకవేళ నీవు ఇతరులను ప్రేమించినట్లు కనిపించినా అది నీ కోసమే ప్రేమిస్తున్నావు కాని వారికోసం నీవు ప్రేమించటము లేదు. ఆ ప్రేమలు నిజం కాదు. జ్ఞాని తప్పించి గురువు తప్పించి ఎవరూ ప్రేమించలేరు.

మీ గురువు ఎవరు అయినా, ఏ సాంప్రదాయంలో ఉన్నా మీరు చేయవలసిన కృషి మీరు శ్రద్ధగా చేస్తే, ప్రేమగా చేస్తే, మీరు ఏ గురువును ఆరాధిస్తున్నారో ఆ గురువు ద్వారా ఈశ్వరుడు మిమ్మల్ని అనుగ్రహిస్తాడు, అనుగ్రహించేవాడు ఈశ్వరుడే. నీకు కనబడే రూపం మాత్రమే గురువు అని అనుకోవద్దు. గురువు అంటే ఆత్మ, బ్రహం. గురువు అవసరమా అయితే ఎంతకాలం అవసరం అని ఎవరో ప్రశ్న వేశారు. భగవాన్

స్పష్టంగా చెప్పారు. నీలో వ్యక్తి భావన ఉన్నంతకాలం, దేహాభిమానం ఉన్నంతకాలం, దేహమే ఆత్మ అనుకున్నంతవరకు నీకు గురువు అవసరమే.

గురువు చెప్పిన మాటలు నువ్వు జీర్ణము చేసుకోవాలి. మాటలు చెప్పేవాడే గురువు కాదు అవి నీకు జీర్ణము అవ్వటానికి అడ్డుపడే వాసనలను కూడా ఆయనే తీసివేస్తాడు. గురువు మాట్లాడుతూ వుంటే ఆ శబ్దం యొక్క అర్థము నీ మనస్సుకు అందుతుంది. కాని గురువు యొక్క మౌనం నీ మనస్సుకు అందదు. మౌనం మనోమూలములో నుండి వస్తుంది నీవు కూడా మనోమూలములోకి వెళ్ళినప్పుడే గురువు యొక్క మౌనము అర్థము అవుతుంది.

జ్ఞానము కలగాలంటే గురువు అవసరమా అని అడుగుతున్నారు. రమణమహర్షి గారికి కూడా బాహ్య గురువు లేకపోయినా అరుణాచలేశ్వరుడే ఆయనకు గురువు. జి.కె.గారు గురువు అవసరము లేకుండా జ్ఞానము పొందవచ్చు అని చెప్పారు అని ఒకరు భగవాన్‌తో అంటే ఆయనకు గురువు అవసరము లేకపోవచ్చు కానీ యితరులకు ఎవరికీ గురువు అవసరము లేదని ఆయన ఎలా చెప్పగలరు అన్నారు భగవాన్. అంటే గురువు యొక్క ఆవశ్యకతని, అవసరాన్ని అంగీకరిస్తున్నారు.

గురువుకు అనుగ్రహము ఒక గుణము కాదు. గురువే అనుగ్రహము. గురువు మనను చూసినా, చూడకపోయినా, మాట్లాడినా, మాట్లాడకపోయినా, మనను చూసి మొహము తిప్పుకున్నా అది కూడా అనుగ్రహమే. ఇది గుర్తించిన భక్తులు ధన్యులు.

జీవితాన్ని ఎలా మలుపు తిప్పాలో ఎప్పుడు మలుపు తిప్పాలో అలా త్రిప్పుతారు. గురువు ఒకోసారి మనని వదిలివేసినట్లు అనిపిస్తుంది కాని అది కూడా మనకి ఏదో మంచి జరగటానికి అని గ్రహించినవాళ్ళు ధన్యులు.

గురువు అంటే ఎవరి అనుగ్రహము వల్ల అన్ని తెలయబడతాయో, ఆత్మజ్ఞానము వైపు నీ మనస్సు మొగ్గ చూపుతుందో వారే నీ గురువు. నీ మనస్సుకు మనసై ఉంటారు. ఆజన్మకాజన్మ నిన్ను మగ్గపెడుతూ వుంటారు. గురువు మీ స్తోత్రాలకు పొంగిపోడు. మీ విమర్శలకు కృంగిపోడు. గురువు ప్రేమ ఎటువంటిది అంటే దేనిని తొలగిస్తే మీకు వస్తువు అందుతుందో దానిని వేరుతో సహా తొలగించటానికి ప్రయత్నం చేస్తాడు వారే నిజమైన గురువు.

ఒక్కసారి మీరు గురువు యొక్క అనుగ్రహంలో పడితే మీ లోపల ఉన్న అజ్ఞానాన్ని శుభ్రంగా తొలగించే వరకు గురువు

మిమ్మల్ని విడిచిపెట్టడు. మనలో ఉన్న మాయను, అజ్ఞానాన్ని తొలగించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. వారే గురువు.

గురువు అంటే శరీరం కాదు. ఆ శరీరం చనిపోతుంది. కాని అనుబంధం మాత్రం చనిపోదు. దానికి ముగింపు లేదు. గురువు ఏ స్థాయిలో ఉన్నారో ఆ స్థాయిలోకి మనలను తీసుకొని పోయేవరకు ఈ అనుబంధం తెగిపోదు.

గురువు ఎలా ఉండాలి అంటే అందరినీ సమంగా ప్రేమించే గుణము ఉండాలి. అందరి మంచిని కోరుకునే హృదయం ఉండాలి. అందరికి అర్ధమయ్యే విధంగా బోధించాలి. గురువు ఏదైతే బోధిస్తున్నారో ఆ వస్తువు యొక్క తాలూకా అనుభవము కూడా వుండాలి. అప్పుడే భక్తులకు అర్ధమవుతుంది, అవగతమవుతుంది.

మన హృదయములో ఉన్న నిజం మన అనుభవము లోకి రావాలంటే మన ప్రయత్నము అవసరమే. గురువు యొక్క దయ లేకుండా కేవలము నీ ప్రయత్నం వల్లనే అది అనుభవములోనికి రాదు. అంటే నీ ప్రయత్నముతోపాటు గురువు యొక్క అనుగ్రహం ఉండాలి. గురువు నీకు చేసే సహాయము ఇతరులకు తెలియాలి అని ఆయన అనుకోరు. ఆయనకు ఇతరులు లేరు.

నా గురువుని ఎలా కనుక్కోవాలి అని ప్రశ్న. నిరంతరం ధ్యానం చేయటం వలన నీ గురువు ఎవరో నీకు తెలుస్తుంది. ఎవరు జ్ఞాపకం రావటము వలన నీ హృదయంలో ఉన్న సౌందర్యము నీకు తెలుస్తుందో, ఎవరిని తలచుకోవటము వలన నీ మనస్సు నిర్మలమవుతుందో వారే నీ గురువు. మనం దేహం అనే అడవిలో ఉన్నాము. ఈ అడవిలోనుండి బయటకు రావటానికి నీకు మార్గము చూపేవాడే గురువు. గురువే ఉపాయం గురువే గమ్యం గురువు యందు భక్తి కలిగినప్పుడు, శరణాగతి భావన కలిగినప్పుడు ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అని స్థిరమైన భావన మీకు కలిగినప్పుడు గురువు అనుగ్రహం మీకు తెలుస్తుంది.

మనం రూపముతో తాదాప్యం పొందుతున్నంతకాలం రూపములేని వస్తువును మనం పొందలేము. మనకు సపోర్టు కావాలి. ఆ సపోర్ట్ కోసమే గురువుని కాని, అవతారపురుషుడిని గాని మనం ధ్యానం చేయాలి. సత్యవస్తువు, మరణము లేని వస్తువు మన హదయములో ఎక్కడ లోతులలో ఉంది. అంత లోతుల లోనికి వెళ్ళటానికి ఇప్పుడు మనకు ఉన్న అభ్యాసం, వైరాగ్యం చాలదు. అభ్యాసం, వైరాగ్యం పెంచుకోవాలి.

నీకు నిరంతరము లోచూపు ఉండాలంటే గురువు అనుగ్రహం ప్రవహిస్తూ వుండాలి. జీవుడు ఎక్కడయితే ఉదయించి వస్తున్నాడో అక్కడకు వాడిని పంపించి, ఎక్కువసేపు అక్కడ

ఉంచగలగాలి. జీవుడి యొక్క పుట్టిల్లు హృదయం. జీవుడిని హృదయంలో ఎక్కువసేపు ఉంచగలిగితే జీవలక్షణాలు నశిస్తాయి, అప్పుడు జీవుడు ఆత్మాకారం చెందుతాడు. ఇవి అన్నీ జరగటానికీ సజ్జన సాంగత్యం, ధ్యానాలు, యాత్రలు, నదులలో మునగటాలు. ఇవి అన్నీ చేయవలసివస్తున్నది. వీటి అన్నింటికంటే అత్యంత బలీయమైనది గురువు యొక్క అనుగ్రహము. ఇది గ్రహించిన వాళ్ళు ధన్యులు.

స్థూల దేహానికి వచ్చే జబ్బులను వైద్యుడు తొలగించితే, ఇక సూక్ష్మదేశానికి - అంటే మనస్సుకు పట్టే జబ్బులను వదిలించేవాడు గురువు. మళ్ళీ మళ్ళీ పుట్టడం - చావడం అనే సంసారమనే జబ్బును నయంచేసి మోక్షమనే పరమానందములో కూర్చోపెట్టేవారే గురువు.

మనకు జన్మ వచ్చేసింది. జన్మకు కారణమైన కర్మ ఎటువంటిదో అటువంటి మార్గంలోనే వాడికి ఆసక్తి కలుగుతుంది. అవగాహన ఏర్పడుతుంది. వాడు కర్మమార్గం అవలంభించాలా? యోగమార్గం మంచిదా? భక్తి మార్గంలో ప్రయాణించాలా? అన్నది వాడికి తెలియదు. అది గురుదేవులకే తెలుస్తుంది. అందుకే గురువు ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా బోధిస్తూ ఉంటారు. వినేవారికి అది అర్థం కాదు. ఎవరి కర్మఫలాలు ఏమిటి? వాటిని ఎలా తొలగించాలి, అలా తొలగించేటప్పుడు వారిని ఎలా

స్వాంతనపరచాలో వివరంగా తెల్సిన ఘనవైద్యుడు గురువు. గురుదేవుల బోధలు శ్రవణం చేయటం మందు అయితే వాటిని ఆచరించి అనుభవములోనికి తెచ్చుకోవటం పథ్యం లాంటిది. మందు వాడి పథ్యం చేయకుండా రోగం తగ్గలేదు. వీడేమి వైద్యుడండి అంటే తప్పు నీదికాని వైద్యుడిది కాదు. శ్రవణం చేసినదానిని మననం చేసుకుంటూ ఆచరించినప్పుడే భవరోగం కూడా తగ్గుతుంది. ఆలస్యమైన ఆచరణలోకి వస్తే తప్పక తరించుతాము.

ఒకోసారి గురువు ఏమి చేస్తారు అంటే మనకు ఇష్టమైన వారిచేత తిట్టిస్తాడు. ఎందుచేతనంటే వారిని హృదయంలో మోస్తూ వుంటాము. హృదయంలో ఎవరిని మోస్తునారో గురువుకు తెలుసు. ఆ మోత తగ్గించడము కోసము వారిచేత తిట్టిస్తాడు. ఆ నాలుగు మొట్టికాయలు పడితే కాని ఆ మోత ఆగదు. నీ లోపల ఏముందో నీకు తెలియదు గాని గురువుకు తెలుస్తూ వుంటుంది. ఎందుచేతనంటే నీ లోపల అంతర్యామిగా ఉన్నాడు. బ్రహ్మానుభవం కలగటానికి ఏ సంసారాలు అయితే నీకు అడ్డుగా ఉన్నాయో వాటిని తొలగించటానికి నిరంతరం, నిర్విరామముగా గురువు కృషి చేస్తూనే వుంటాడు. నీవు ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని నదులలో మునిగినా గురువు అనుగ్రహానికి అవి సాటికావు. ఎన్ని రచనలు చేసినా ఎన్ని ప్రవచనాలు చేసినా గురువు యొక్క

మౌనంలోని శక్తిని, గురువుయొక్క మాటలలో వున్న శక్తిని వర్ణింపలేరు. గురువు చేసే పని మనం గ్రహించాలి అనుకున్నా అది నీకు అందదు.

గురువు ఎలా ఉంటాడు అంటే ఇక్కడ భగవాన్ చెపుతున్నా వారు శాంతిలో ఊగిసలాడుతూ ఉంటారు. అది లౌకికమైన శాంతి కాదు. అది అలౌకికమైన శాంతి, అభౌతికమైన శాంతి. అది ఈ లోకానికి, ఈ భూమికి సంబంధించిన శాంతి కాదు. నిప్పుకు వేడి ఎంత సహజముగా ఉంటుందో వారికి శాంతి, దయ, ఓర్పు ఇవి అన్నీ అంత సహజముగా ఉంటాయి. గురువు యొక్క వైభవము నోటితో చదవటం వలన, వినటం వలన తెలియదు. నీ స్వరూపం నీకు తెలిసినప్పుడు గురువు యొక్క వైభవం నీకు తెలుస్తుంది. ఎందుచేతనంటే నిజమైన గురువు నీ స్వరూపంగానే ఉన్నారు.

నేను మోక్షం పొందాలంటే కృషి ఒక్కటే సరిపోతుందా, గురుకృప ఉండాలా అని ఒకరు అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీకు మోక్షం పొందాలి అనే తలంపు కలుగచేసినవాడు కూడా గురువే, మోక్షం పొందాలి అనే తలంపునకు రావడం కూడా గురుకృపవలనే వచ్చింది. గురుకృప లేకపోతే నీకు ముముక్షత్వం రాదు. నీకు అమృతత్వం కలిగాక తెలుస్తుంది, నీవు చేసింది తక్కువ, గురువు ఇచ్చింది ఎక్కువ

అని. అంతా గురువే. ఈ శరీరం మరణించినా రాబోయే జన్మలో కూడా గురువు నిన్ను విడిచిపెట్టడు. వీడు ఎక్కడ ఉన్నాడు, ఎక్కడ శరీరం ధరించాడు అని వెంటాడతాడు. ఆయనమీద ప్రేమ కలిగేటట్లు కూడా ఆయనే చూసుకుంటాడు. మన అహంకారము ఏమి ప్రేమిస్తుంది గురువు యొక్క దయ మహా ప్రవాహంలాంటిది. అది ఈ రూపంలోనుండి ఈ నామములోనుండి మనలను విడుదల చేసి జ్ఞానంలో ఐక్యం చేస్తుంది, వారే గురువు. నీవు ఏదైనా చెడు స్నేహాలలో ఉన్నావు అనుకో, ఆ బ్యాడ్ కంపెనీ వలన నీవు ఎక్కడికి పోతావో గురువుకు తెలుసు. అందువలన ఆ బ్యాడ్ కంపెనీలో నుండి నిన్ను విడుదల చేయటానికి ప్రయత్నం చేస్తారు వారు గురువు.

శివుడు కంటే విష్ణువు ఎక్కువ, విష్ణువు కంటే శివుడు ఎక్కువ అని ఆ గందరగోళంలోకి వెళ్ళవద్దు. దాని వలన మనస్సు కలుషితం అవుతుంది. నీకు శాంతి లేనప్పుడు, నీకు ఆనందము లేనప్పుడు ఏ దేవుడు గొప్పవాడు అయితే నీకు ఏమిటి? మీరు సత్యాన్వేషకులుగా ఉండండి. దానికోసం గురువుని సపోర్ట్‌గా తీసుకోండి. మీకు సత్యం తెలియకపోయినా గురువుకు తెలుస్తుంది. మీకు సత్యానుభవం కలిగేవరకు గురువు మిమ్మల్ని విడిచిపెట్టరు. అధ్యయనం కంటే, జపధ్యానాలకంటే వోలి కంపెనీ అత్యంత ముఖ్యమైనది, వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేస్తాయి.

సత్పురుషుల సహవాసం వలన మన హృదయంలో ఏదో ఉంది దానిని తెలుసుకోవాలనే తపన మనకు కలుగుతుంది. హృదయం ఖాళీ అయ్యేవరకు ఎవడికి ఆత్మజ్ఞానం కలిగే అవకాశం లేదు. ముందు హృదయం ఖాళీ అవ్వాలి. దీనికి గురుకృపకన్నా వేరే మార్గము లేదు కదా!

నేను ఆత్మను, నేను చైతన్యాన్ని అని నోటితో అనుకోవటము పెద్ద ప్రయోజనము ఉండదు. అహం బ్రహ్మోస్మి అని నోటితో అనుకుంటే సరిపోదు. దాని తాలూకా అనుభవం నీకు ఉండాలి, దానితో నీవు ఏకం కావాలి. అప్పుడు ఈ సంసార చక్రములో నుండి విడుదల పొందుతావు. స్వప్ర యత్నము, కాలపరిపక్వం, ఈశ్వర కటాక్షం, గురుకృప అన్నీ కలిసి వస్తేనే నీకు అనుభవము వస్తుంది.

ఈ శరీరమే ఆత్మ, ఈ శరీరమే సర్వస్వం, ఈ శరీరమే జ్ఞానం అని మనం అనుకుంటున్నాము. ఆత్మకు శరీరం లేదు. ఈ శరీరం అహంభావనది. ఈ శరీరము ఆత్మ కానప్పుడు, ఇదే ఆత్మ అని ఎందుకు అనుకుంటున్నాము అంటే దీనికి అజ్ఞానం కారణం. అందులో నుండి మనను విడుదల చేసి, ఆత్మ ఒక్కటే సత్యం, అదే శాంతి, అదే జ్ఞానం అని మన అనుభవములోనికి తీసుకొని వస్తారు వారు గురువు. ఆత్మ అన్నా, గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా ఒకటే. ఆత్మను విడిచిపెట్టి గురువు లేదు.

కోటి గ్రంథాలు చదవడం కంటే కోటి ప్రాణాయామాలు చేయటం కంటే మనం బాగుపడటానికి గురువు యొక్క అనుగ్రహం లిప్తమాత్రం సరిపోతుంది.

దేవుడు ఎటు చూస్తున్నాడు అని ఒక శిష్యుడు గురువుగారిని అడిగాడు. దీపం ఎటు చూస్తుందో దేవుడు కూడా అటే చూస్తున్నాడు అని గురువుగారు చెప్పారు. దాని అర్థం ఏమిటి అంటే దీపం అన్ని వైపులకు చూస్తూ వుంటుంది అలాగే దేవుడు అన్ని వైపులకు చూస్తూ ఉంటాడు.

మీకు ఏదైనా శాంతి కలుగుతుంది అంటే, కామ్‌గా, క్వైట్‌గా ఉంటున్నారు అంటే దానికి గురువు యొక్క అనుగ్రహమే కారణం. గురువుకి దేహం ఉన్నా ఆయన దేహరహితుడు. ఆయన దేహంతో ఆయనకు తాదాప్యం ఉండదు. ఆ దేహము ఎందుకు వచ్చిందో అవగాహన ఉంటుంది. ఆ వచ్చిన పని మీదే గురువు దృష్టి పెడతాడు. ఆయనకు స్వంత పని ఏమీ ఉండదు. భక్తులను తరింప చేయటానికే దేహము ధరించి వస్తారు.

నీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతి కూలముగా ఉన్నా, నీకు కష్టము వచ్చినా, నష్టము వచ్చినా నువ్వు ఒక్కడివే ఇండిపెండెంట్‌గా, శాంతిగా, సుఖముగా ఉండేటట్లు నీ మనస్సును పటిష్టం చేస్తాడు. నువ్వు ఎంత దు:ఖంలో ఉన్నా, ఎంతో అశాంతిలో ఉన్నా వాటిని తట్టుకొని సుఖంగా, శాంతిగా

ఉండగల శక్తిని గురువు నీకు ప్రసాదిస్తాడు. వీక్‌మైండ్‌ను స్ట్రాంగ్ మైండ్‌గా మార్చి దానికి లోచూపు కలుగచేసేవాడే గురువు. సమాజము యొక్క సహాయ సహకారములు అర్థించకుండా భక్తుడికి అంత ప్యూరిటీని, పటిష్టతను ఇచ్చి వాడికి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించడం ఒక్క గురువుకే సాధ్యం. మన జీవితములో ఎప్పుడైనా ఇటువంటి శాంతిని అనుభవిస్తామని ఊహించామా అని నిన్ను నీవు చూసుకొని తన్మయత్వం పొందే స్థితిని నీకు ప్రసాదిస్తాడు, వారు గురువు. కంటిని రెప్ప ఎలా కాపాడుతుందో అలాగ గురువు మనల్ని కాపాడుతూ ఉంటారు.

నీవు ఏదిగా ఉన్నావో దాని తాలూకా అనుభవం నీకు తీసుకొనిరావటానికి బోధిస్తాడు గురువు. తాను ఎవరో తాను తెలుసుకున్నప్పటికి నీతో సామాన్యుడిగా తిరుగుతూ నీతో మాట్లాడుతాడు. నిన్ను ఎక్కడకు తీసుకొని వెళ్ళాలో అది దృష్టిలో పెట్టుకొని నీతో మాట్లాడతాడు. నీ స్నేహం ఆయనకు అక్కరలేదు, కాని వారి స్నేహం నీకు కావాలి అందుచేత వారి కంపెనీ నీకు ఇస్తారు. వారు గురువు. మా కంపెనీ గురువుకి కావాలి అనే పరిస్థితికి అప్పుడప్పుడూ మీరు వస్తూ వుంటారు. నీ గురువు నీతో మాట్లాడుతూ నీ మనస్సును నిశ్చలం చేస్తాడు, నిర్మలం చేస్తాడు, నీ మనస్సుని హృదయం లోనికి నెట్టుతూ ఉంటాడు, ఆయన మౌనంగా ఉన్నా, నీతో మాట్లాడినా నీతో స్నేహం చేసినా

ఆయన పొందవలసినది అంటూ ఏమీ లేదు. నిన్ను అభయస్థితిలోనికి తీసుకొని వెళ్ళటానికే ఇవి అన్నీ చేస్తాడు.

గురువు అంటే ఆత్మ, చైతన్యం, ప్రకాశం. పెరుమాళ్ళ చివరి రోజులలో భగవాన్ దగ్గరకు వచ్చి నేను చాలా అపచారం చేశాను నేను నా యీ అపచారానికి నరకానికి వెళతాను అన్న సంగతి నాకు ఇప్పుడు తెలుస్తుంది అంటాడు. అప్పుడు భగవాన్ ఏమి చెప్పారంటే నీవు చేసిన చెడ్డను నేను జ్ఞాపకం పెట్టుకోను, నీవు చేసిన మంచినే నేను జ్ఞాపకం పెట్టుకుంటాను. ఓ పెరుమాళ్ళు నీవే కనుక నరకానికి వెళితే నిన్ను ఉద్ధరించడము కోసము నేను నరకానికి వస్తాను అని చెప్పారు. ఎంతకాలమైతే నీకు దేహాభిమానం ఉందో అంతకాలం నీ కోసం గురువు దేహం ధరించి వస్తాడు. అజ్ఞానంతో నీకు ఉన్న తాదాప్యం తొలగిస్తాడు. ఆత్మ తప్ప ఇంకేమీ లేదు, ఉన్నది ఒక్కటే అనే అనుభవం నీకు కలిగేవరకు గురువు నిన్ను వెంటాడుతూ ఉంటాడు.

మనము చేసే సాధనలన్నీ రెండో పక్షం. గురువు యొక్క కృపలేకుండా మనం గురువును పొందలేము. నీ హృదయంలో ఒక నిజం ఉంది, అది నీ స్వరూపమే. కాని గురుకృప లేకుండా అది నీకు లభ్యముకాదు. గురువు యొక్క దయ ఎలా ఉంటుంది అని అడిగితే అది మాటలకు అందదు, ఊహలకు అందదు, సంకల్పాలకు అందదు, మనస్సుకు అందదు. దానిని నన్ను

ఎలా చెప్పమంటావు. మాటలకంటే మౌనం ఎక్కువ సందేశం ఇస్తుంది కాని మౌన సందేశము అందరికి అర్థం కాదు.

మీరు భక్తి మార్గంలో ప్రయాణం చేసినా, జ్ఞాన మార్గంలో ప్రయాణం చేసినా, ధ్యాన మార్గంలో ప్రయాణం చేసినా, మీరు ఏ గురువును ఆశ్రయించినా, మీరు ఏ రూపాన్ని ధ్యానం చేసినా ఏ నామాన్ని స్మరించినా మీరు పొందవలసింది హృదయంలోనే పొందాలి అది మర్చిపోవద్దు.

గురువు యందు మీకు విశ్వాసం ఉండాలి. గురువు మాటను పాటించే బుద్ధి మనకు కలగాలి. గురువు నీకు మంచి విషయాలను, దైనందిన జీవితంలో ఉపయోగపడే విషయాలను చెప్పినప్పుడు వాటిని గాలికి వదిలివేయకుండా నీ హృదయంలోనికి తీసుకొని వాటి ప్రకారము జీవించటమే గురువుని గౌరవించటం. గురువు హృదయంలో నుండి వచ్చిన నోబుల్ థాట్స్, నోబుల్ యాక్షన్స్, నోబుల్ వర్డ్సను వృధా చేయకుండా లోభివాడు తన ధనాన్ని ఎంత జాగ్రత్తగా పెట్టుకుంటాడో అలాగా గురువు చెప్పిన మంచి మాటలను అంత జాగ్రత్తగా హృదయపూర్వకంగా స్వీకరించి వాటిని ప్రాక్టీస్ చెయ్యాలి. అప్పుడు మీరు గురువు సమీపంలో ఉన్నట్లు లెక్క. గురువు రూపాన్ని, గురువు నామాన్ని, గురువు టీచింగ్‌ను, గురువు లైఫ్‌ను నీ హృదయంలో కాపాడుకోవాలి. ఎందుచేత నంటే దేవుడి కంటే కూడా గురువే

ఎక్కువ. ప్రారబ్ధం ద్వారా నీవు ఏమైనా మొట్టికాయలు తినవలసి ఉంటే ఆ మొట్టికాయలు పడిపోతాయి. మొట్టికాయలు నీకు పడ్డా దాని తాలూకా బాధ ఏమీ కొంచెము కూడా లేకుండా చేసి నీకు ధైర్యాన్ని యిచ్చి జ్ఞానాన్ని ప్రసాదించేవాడు గురువే. రేపు ఎలా ఉన్నా, ప్రారబ్ధంలో ఏది తొంగి చూస్తున్నా గాలివాన వచ్చినప్పుడు గాలి ఎంత స్పీడుగా ఉంటుందో నీ ప్రారబ్దం యొక్క వేగం అంత స్పీడుగా ఉన్నప్పటికి దానిని తట్టుకొనే శక్తిని ప్రసాదించే వాడు గురువు.

గురువు యొక్క విలువ నీకు తెలియటము లేదు. ఈశ్వరుడు ఎడ్మినిస్ట్రేటర్ మాత్రమే. కాని గురువు అలా కాదు. డెస్టినీ ప్రకారం మీకు రావలసిన కష్టాలు, హింస వస్తున్నప్పటికి దాని యొక్క ప్రభావం నీ మనస్సు మీద పడకుండా చేసి మిమ్మల్ని స్వీట్‌గా, హ్యాపీగా ఉంచేవాడు గురువు. అవసరమైతే మీ ప్రారబ్ధాన్ని తీసుకునేవాడు గురువు. శిక్షించేవాడు ఈశ్వరుడు, రక్షించేవాడు గురువు. మట్టి ముద్దలమైన మనల్ని బంగారు ముద్దలుగా తయారు చేసేవాడు గురువే.

గురువు చెప్పిన వాక్యాన్ని మనం దృష్టిలో పెట్టుకోవాలి. ఎందుచేతనంటే ఆ వాక్యము దేవుడై ఉన్నది. అంటే వారి హృదయంలో ఉన్నదే వారు మాట్లాడుతారు. ఇది మీరు జ్ఞాపకం పెట్టుకోవాలి. మనకు ఏది మంచిదో మనకంటే గురువుకు ఎక్కువ

తెలుసు. అందుచేత ది గ్రేటెస్ట్ థింగ్ ఈజ్ టు స్టాప్ వర్రీ. ఇంక మనకు వర్రీ అక్కరలేదు. గురువు యొక్క వాక్యముతో పెనవేసుకుంటే దానితో మీకు తాదాప్యం వస్తుంది. మీ జీవితాన్ని మీ గురువుకు అంకితము చెయ్యి.

నీకు గురువు పట్ల ఫెయిత్ ఉండాలి ట్రూ లవ్ ఉండాలి. శరీరాలు ఎక్కడ ఉన్నాయి అనేవి ముఖ్యం కాదు, నీ మనస్సు గురువు సమీపంలో ఉండాలి. గురువు సమీపంలో ఉంటే అది స్లోగా ప్యూరిఫై అవుతుంది. నువ్వు ఎక్కడ ఉంటున్నావు? ఏమి తింటున్నావు అని కాదు. నువ్వు అమెరికాలో ఉన్నా నీ తలంపును చూస్తూ ఉంటాడు. నీ తలంపులో ఏదైనా దోషం ఉంటే వెంటనే దానిని సరిచేస్తాడు. నిన్ను పవిత్రం చేస్తాడు. గురువు అంటే శరీరం కాదు, గురువు యొక్క శరీరం పడిపోయిన తరువాత కూడా ఆయనతో మనకు అనుబంధం కంటిన్యూ అవుతుంది. ఎందుచేతనంటే గురువుకు శరీరం ఉన్నప్పుడు కూడా ఆయన ఆ శరీరం కాదు. ఏదైతే మనలను అనుగ్రహిస్తోందో అది మేటర్ కాదు. దానికి మరణం లేదు. మట్టిలో ఉన్నా మనల్ని బంగారంలా మార్చేవాడే గురువు. పూర్ణస్థితి పొందేవరకు ఆయన మనలను విడిచిపెట్టడు. వారు గురువు. మన గురువకు పూజ చేసినా, సేవ చేసినా గురువు యొక్క ఋణం తీర్చుకోలేము. గురువు ఎటువంటి వారు అంటే మీరు యింటికి వెళ్లి జపం, ధ్యానం

చేయనక్కరలేదు. వారిని శ్రవణం చేస్తే చాలు మనకు జ్ఞానం వచ్చేస్తుంది. అలా రాని పద్ధతిలో మీరు ఇంటికి వెళ్ళిన తరువాత గురువు చెప్పినది మీ మనస్సులో మననం చెయ్యాలి. ఎప్పటివరకు అలా చెయ్యాలి అంటే మీరు ఏదిగా ఉన్నారో అందులో మీరు స్థిరపడాలి.

గురువు యొక్క మౌనం అన్నింటికంటే బిగ్గరగా జరిగే ఉపదేశము. నీకు సాధనాబలం ఉంటే, తపోబలం ఉంటే గురువు యొక్క మౌనం నీకు అర్ధమవుతుంది. గురువు యొక్క మౌనం సంపూర్ణముగా ఉంటుంది. సమగ్రంగా ఉంటుంది. గురువు యొక్క మౌనంలోనుండే అనుగ్రహం నీకు అందుతుంది. మీరు ఎంతటి వారైనా అనుగ్రహం లేకుండా ఆత్మానుభవం ఎవరికి కలుగదు. గురువు అనుగ్రహంలో పడ్డవాడికి ఇంక క్షోభ ఉ ండదు. బాహ్య పరిస్థితులు వాడికి అనుకూలముగా ఉన్నా, ప్రతికూలముగా ఉన్నా అవి వారిని బాధించవు. వాడి మనస్సు కాలిపోయిన తాడులాగా అవుతుంది. మనస్సు సూక్ష్మాతిసూక్ష్మం అవుతుంది. వాడికి లోచూపు కలుగుతుంది. ఎప్పుడైతే హృదయం యొక్క లోయల లోనికి ప్రవేశించాడో సత్యవస్తువు దాని స్వరూపాన్నే ఇచ్చేస్తుంది.

గురువు యొక్క మాట, చూపు పరిసరం అంత బలీయమైనవి. నీ మనస్సులో ఉన్న వాసనలు రాలేవరకు

తడిగుడ్డను పిండినట్లు నీ మనస్సును పిండుతాడు. ఎందు చేతనంటే మిమ్మల్ని బాధపెట్టటానికి కాదు, మీ చైతన్య స్థాయిని పెంచటానికి, మిమ్మల్ని హృదయ గుహలోనికి తీసుకొని పోవటానికి, మీరు ఏద్రైతే అయి ఉన్నారో ఆ వస్తువును మీకు అందించటానికి గురువు చేసే ప్రక్రియ అది. గురువు ఆత్మ అయి ఉన్నాడు. జీవుడి ప్రేమకు అంతం ఉంది గాని గురువు ప్రేమకు ముగింపు లేదు.

శ్రీకృష్ణుడు యుద్ధంలో ప్రతిరోజూ అందరిని సాగనంపి ఆఖరున తన ఇంటికి వెళ్ళేవాడు. అదే విధంగా గురువుగారు అందరినీ తరిపంచేసి తను వెడతాడు. అక్కడ యుద్ధం అంటే, ఇక్కడ మన సాధనే యుద్ధం. ఈ సాధనలో ఒక చిన్న వాసన కూడా మిగల్చకుండా హృదయంలో లయింపచేసి, అన్ని వాసనలు నశించిపోయాక చివరకు తన స్వరూపంగా వ్యక్తమవుతాడు. అందుచేత గురువు పట్ల మన భక్తి శాంతిగా, స్థిరంగా ఉండాలి. గురువు పట్ల మీకు ఉన్న సజీవమైన ప్రేమకు ఎంతటి సాధనైనా సాటిరాదు.

గురువుకి మనకి హార్ట్ టు హార్ట్ ఆప్యాయత ఉండాలి. అలా బుద్ధుడు కూడా ఆనంద్ ఉండేవాడు. బుద్ధుడికి మంచినీళు ళ కావాలి అనుకోండి నీళ్ళు కావాలని బుద్ధుడు అడగలేదు కాని బుద్ధుడికి నీరు కావాలని ఆనంద్‌కు తెలిసేది. ఆకలి వేస్తే ఆయన

అడగకుండానే బుద్ధుడికి ఆకలిగా వుందని తెలిసేది. అట్టిది ఆప్యాయత. లోపల వున్న అనురాగానికి దేహాలతో సంబంధము లేదు, అది ప్యూర్ లవ్. మీరు గురువు అనుగ్రహం గురించి చెబుతారు, ప్రేమ గురించి ఎప్పుడూ మాట్లాడరేమిటి అని భగవాన్‌ను అడిగారు, అనుగ్రహం ప్రేమ లేకుండా ఉంటుందా అన్నారు భగవాన్.

మన జేబులో పది రూపాయల కాగితం ఉంది అనుకోండి, అది పోవాలని అనుకోము. ఎందుకంటే అది మనది అని అనుకుంటున్నాము. అది ఎప్పుడయినా మనకు తెలియకకుండా పోయింది అనుకోండి పోయింది, పోయింది అంటాము. అలాగే మన అహంకారాన్ని మనం పోగొట్టుకోలేము. మనకు గురువు అనుగ్రహము ఉంటే మన అహంకారము మనకు తెలియకుండానే జారిపోయేటట్లు చేస్తారు. దాన్ని మన తెలివితేటల వలన మనం పోగొట్టు కోలేము. పరమాత్మ ఎప్పుడు ఎవరికి దర్శనము ఇచ్చినా సద్గురువు రూపంలో దర్శనమిస్తాడు. గురువు కామధేనువు, కల్పవృక్షం, చింతామణి. గురువు జ్ఞానామృతాన్ని శిష్యునికి తరుణం కనిపెట్టి యొసంగుతాడు.

లోకానికి సంబంధించిన ఆకర్షణలలో పడి మార్గం తప్పిపోతున్నారు. ఈ చావులు, పుట్టుకలు, బంధువులు, విరోధులు, స్నేహితులు ఇంది అంతా మనస్సు కల్పించిన

గొడవలు, ఇది అంతా తాత్కాలికం. కాని గురువుతో ఉన్న సంబంధం శాశ్వత సంబంధం. మనకు జ్ఞానం వచ్చేవరకు గురువు మనలను విడిచిపెట్టడు. మనకు బాగా ఇష్టమైన వ్యక్తి కలకాలానికి కనిపిస్తే ఎలా కౌగలించుకుంటామో మనం గురువు అనుగ్రహం పొందితే మరణాన్ని అలా కౌగలించుకుంటాము. ఒక గంటలో మనకు మరణం వస్తోంది అనుకోండి, మనకు భయం వేయదు. గురువు అనుగ్రహాన్ని పొందాము కాబట్టి స్నేహితుడిని కౌగలించుకున్నట్లు మరణాన్ని కూడా కౌగలించుకుంటాము. గురువు మీద మనకు ఉన్న ఇష్టము మనస్సు కల్పితం కాదు.

మనం డ్యూటీ చేయాలి, మమకారం పెట్టుకోకూడదు. పని వలన దుఃఖము రాదు, మమకారం వలన దు:ఖం వస్తుంది. గురువుతో ఉన్న సంబంధం ఒక్కటి మాత్రమే శాశ్వతమైనది. మనం గురువును ఎన్నుకోవటములో విశేషం లేదు. గురువు మనలను ఎన్నుకోవడములో వైభవం అంతా అక్కడ ఉంది. గురువు మనలను ఎన్నుకుంటే వాడు ఎన్ని జన్మలలో ఎక్కడ ఏ లోకంలో ఉన్నా వాడు రక్షింపబడి తీరతాడు అది గురువు అనుగ్రహం.

మనస్సు అణిగినప్పుడు కొంత ఆనందము రావచ్చు. అక్కడ ఆగిపోవద్దు. ఇంకా లోపలకు వెళ్ళాలి. ఈశ్వరుడు మన హృదయములో అంతర్యామిగా ఉన్నాడు కదా వాడి దగ్గరకు

చేరుకొనేవరకు మీ ప్రయాణము ఆపుచేయవద్దు. అదే గమ్యంగా పెట్టుకోండి. వినండి, చూడండి, మననం చెయ్యండి అంటే చెవులతో వినటం కాదు, లోపల మనస్సుతో వినాలి. ఏ వస్తువు బాగుపడాలో ఆ వస్తువుతో వినాలి. ఆ వస్తువుతోటే గురువును చూడాలి. ఆ వస్తువుతోటే మననం చేయాలి, అప్పుడు మీరు తరిస్తారు. గురువు చెప్పే ప్రతిమాట అది మాట కాదు, అది అనుగ్రహం. లోకానికి సంబంధించిన ప్రయోజనం కోరి చెపితే అది మాట. కేవలం మిమ్మల్ని జ్ఞానగంగాస్నానం చేయించటానికి చెపుతున్నాడు అది మాట కాదు అది అనుగ్రహం.

మనం అజ్ఞానమనే దీర్ఘనిద్రలో ఉన్నాము. ఈ అజ్ఞానము అనే నిద్రనుండి మనలను లేపేవాడు ఒక్క గురువు తప్పించి ఎవడూ లేడు. ఆత్మజ్ఞానం ఉన్నవాడు మాత్రమే మీ ఈ నిద్రలో నుండి మీకు మెలుకువ తీసుకొని రావాలి కాని మరొకరి వల్ల సాధ్యం కాదు. మనం ఎంత సహజంగా గాలి పీల్చుకుంటామో అంత సహజంగా అంత నార్మల్‌గా గురువు మనకు సహాయం అందిస్తాడు గాని నేను ఏదో ఉద్ధరిస్తున్నా అనుకునేవాడు గురువు కాదు. గురువు ఏ పని చేసినా సహజంగా చేస్తాడు. అందులో ఏదో విశేషం ఉందని ఆయన అనుకోడు.

సాధన ఎందుకు అంటే మనలో అంతర్యామిగా ఉన్న సద్వస్తువుని గ్రహించటానికి మన మనస్సును, శరీరాన్ని సిద్ధం

చేయటానికే సాధన. అంతర్యామి యొక్క అనుగ్రహం లేకుండా, ఆయన పట్ల మనకు శరణాగతి లేకుండా, ఆయన కటాక్షం లేకుండా కోటి జన్మలు ఎత్తినా మనకు శాంతి కలగదు. బయటి గురువు నిన్ను పుష్ చేస్తాడు, లోపల గురువు నిన్ను పుల్ చేస్తాడు. బయటి గురువు నిన్ను ప్రిపేర్ చేసి లోపలకు గెంటుతాడు, లోపల గురువు నిన్ను లోపలకు లాక్కొంటాడు. బయట గురురూపంలో ఉన్నవాడు, లోపల గురురూపంలో ఉన్నవాడు ఈశ్వరుడే. బయటి నుండి నీ మనస్సును లోపలకు గెంటేవాడు, హృదయాభిముఖంగా నీ మనస్సు త్రిప్పేవాడు గురువే. సమస్తం గురువే. గురువు యొక్క దయ లేకుండా ఈ వాసనలు అనే దుంగలను బయటకు గెంటలేము.

గురువు యొక్క అనుగ్రహం పొందటానికీ ఈ గురు మహోత్సవం ఏర్పాటు చేశారు. గురువు యొక్క అనుగ్రహం లేకుండా మనకు స్వరూపజ్ఞానం కలగదు. గురువును మనం పట్టుకోవటం వేరు. గురువు మనలను పట్టుకోవటం వేరు. గురువుని మనం పట్టుకుంటే ఒకసారి వదిలేసే ప్రమాదం ఉంది, వదిలేస్తాము కూడా. మనం ఎంత బుద్ధిమంతులం అంటే మనలో ఉన్న దోషాలు చూసుకోవటం మానివేసి గురువులో దోషాలు చూస్తుంటాము. ఆచార్యులవారు అలా అన్నారు, రమణుడు ఇలా

ఉన్నారు, ఆయనకు కులబేధం పోలేదు, ఈయనకు మతబేధం పోలేదు. ఇలాగ ఏదో ఒకటి బాహ్యదృష్టితో చూసినప్పుడు వారిని వదిలేస్తే బాగుండును అని మనకు అనిపిస్తుంది. దీనికి కారణం మనకు ఉండ వలసినంత పవిత్రత లేకపోవడం. బుద్ధిసూక్ష్మత లేకపోవటం.

గురువు తన భక్తుడి యొక్క అహంకారం అనే పశు వును తొలగించటానికి ప్రయత్నం చేస్తాడు గాని వాడి అహంకారాన్ని సంతృప్తి పరిచేవాడు ఎవడూ గురువు కాదు. గురువు ద్వారా పనిచేసేవాడు ఈశ్వరుడే అని మనకు తెలియక గురునింద చేస్తాము. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే దేవుడిని నిందిస్తే గురువు రక్షిస్తాడు కాని గురువుని నిందిస్తే రక్షించేవాడు ఎవడూ లేడు. గురువు మనలను పట్టుకొన్నాడు అంటే అది జన్మాంతర అనుబంధం అని గుర్తుపెట్టుకోండి. ఎల్లమ్మ, పుల్లమ్మ మాటలు పట్టుకొని పదిరోజులు వాడు గురువు అని, పదిరోజులు వీడు గురువు అని తిరిగితే చివరకు అవి నిలబడే టిక్కెట్లు కాదు. వారు చెప్పే మాటలు ఒకటి, లోపల ఏవో కోరికలు, అధికార వాంఛ ఉంటుంది, వారికి అహంకారాన్ని గ్లోరిఫై చేయాలి అనుకుంటారు. గురువు దగ్గరకు వెళ్ళినప్పుడు ఎప్పుడూ పెద్దరికాలు కోరుకోకూడదు, మన గర్వం అక్కడ చూపించకూడదు. కొంతమంది ఏమి చేస్తారు అంటే వారి

మనస్సులో ఏవో వికారాలు ఉంటాయి. అవి అక్కడ కక్కుతూ ఉంటారు. గురువు ఆ వికారాలను తొలగించటానికీ చూస్తాడు కాని ఆ వికారాలతో తాదాప్యం పొందదు. వాటితో తాదాప్యం పొందితే వాడు గురువు అవ్వడు. వాడు జీవుడే అవుతాడు. ఏ జీవుడిని ఎప్పుడు ఎక్కడ ఎలా అనుగ్రహించాలో అన్నీ గురువే చూసుకుంటాడు, దానికోసం ఎదురు చూడనక్కరలేదు. తొందరపాటు పనికిరాదు, తొందరపాటు వలన మనమే నష్టపోతాము. మనం నిజమైన భక్తులమైతే మనం గురువును అడిగితే ఒక్కటే నాకు భక్తి అనే భిక్ష పెట్టమని, అంతకంటే అడిగేది ఏమీ లేదు. నదికి వరద వచ్చినప్పుడు ఆ నదీ ప్రవాహంలో పెద్ద పెద్ద వృక్షాలు, దుంగలు, గడ్డిపరకలు కొట్టుకొని వెళ్ళిపోయినట్లుగా ఎలాగా కొట్టుకొని పోతామో అలాగ ఈశ్వరుని పట్ల, గురువు పట్ల మనకు నిజమైన భక్తి కుదిరితే ఆ భక్తి ప్రవాహంలో మనలో ఉన్న బలహీనతలనే దుంగలు, వాసనలు అనే బండరాళ్ళు బయటకు కొట్టుకొనిపోయి కాలిబూడిద అయిపోతాయి. భౌతిక ప్రేమలలో తల్లిప్రేమ గొప్పది కాని గురువుప్రేమ అంతకంటే గొప్పది. ఒకోసారి మీతో కఠినంగా మాట్లాడవచ్చు, ఒకోసారి మాట్లాడకపోవచ్చు, అలాగని మామూలు మనిషిని చూసినట్లుగా గురువును చూడకూడదు.

గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు, ఈ లోపుగా మీ దేహం చనిపోయినా మీరు ఎక్కడ ఉన్నారో చూసి అక్కడకు వచ్చి ఆయన మీద మీకు ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకొని మిమ్మల్ని ఉద్ధరిస్తాడు, తరింపచేస్తారు వారే గురువు. గురువు దగ్గర అనుగ్రహం తప్పించి ఇంకోటి లేదు.

మీరు హిమాలయాలలో తపస్సు చేశారా? ఏమి సాధన చేశారు? అని నన్ను అడుగుతూ ఉంటారు. మాకు ఏదైనా జ్ఞానం వచ్చింది అంటే, ఏదో నాలుగు మాటలు చెప్పగలుగు తున్నాము అంటే, హృదయంలో ఉన్న నిజం తాలూకు ఎరుక కొంచెము అయినా మాకు ఉంది అంటే అది గురువు అనుగ్రహమే కాని మా సాధనా ఫలితం కాదు. మేము కష్టపడి సాధనలు చేసింది ఏమీలేదు. మమ్మల్ని కరెక్టుపాత్‌లో పెట్టి, హెచ్చుతగ్గులు లేకుండా చూసి, మేము వందమంది విరోధుల మధ్యలో ఉన్నా పతనం అవ్వకుండా చూసేది గురువే. నేను మిమ్మల్ని ఎంత స్పష్టంగా చూస్తున్నానో, మీరు నన్ను ఎంత స్పష్టంగా చూస్తున్నారో గురువు యొక్క రక్షణ కూడా మాకు అంత స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది అన్నారు నాన్నగారు.

మన మనస్సు స్వాధీనంలో ఉండటం లేదు ఏమిటి, ఇలా అయిపోతున్నాము ఏమిటి అని కంగారు పడకండి. గురువు మీద ప్రేమ, భక్తి, విశ్వాసం అలా నిలబెట్టుకోండి, చేయవలసినది

అంతా ఆయనే చేస్తాడు. మేము సాధన చేస్తున్నాము అని గర్వపడకండి. రూపాయికి వందపైసలు అయితే మీరుచేసే సాధన ఒక పైసా విలువ చేస్తుంది. మిగతా 99 పైసలు గురువే. మీ సాధనలో గురువు యొక్క పాత్ర అత్యంత ప్రధానమైనది. మీరు కంగారుపడుతున్నా అని ఆయన కంగారుపడడు. మిమ్మల్ని నెమ్మదిగా ప్రిపేర్ చేస్తాడు. మీరు డిజర్వు అయినప్పుడు మీకు జ్ఞానం ఇవ్వడానికి ఒక్క క్షణం కూడా వెయిట్ చెయ్యడు. మన గురించి గురువు ఏమీ తెలియదు అనుకోవద్దు. ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన దగ్గర కూర్చుంటే మన జీవితాలు అన్నీ తెరవబడిన పుస్తకాలు వంటివి. మన గురించి మనకంటే గురువుకు ఎక్కువ తెలుసు అది మర్చిపోకూడదు. గురువు సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు. నీవు బ్రహ్మంలో ఐక్యం అయ్యేవరకు గురువు నిన్ను విడిచిపెట్టడు. బంధువులు, స్నేహితులు నిన్ను విడిచి పెట్టేస్తారు. కాని గురువు నిన్ను వెడిచిపెట్టడు. వేటగాడు జంతువును ఎలా వేటాడుతూ ఉంటాడో నీకు ఆత్మజ్ఞానం కలిగేవరకూ అలాగ గురువు నిన్ను వెంటాడుతూ ఉంటాడు. వేటాడటం అంటే నీ అజ్ఞానాన్ని వేటాడతాడు, అది బయటకు పోకుండా నువ్వు బ్రహ్మీస్థితిని పొందలేవు.

## శ్రీ నాన్న చాలీసా

జిన్నూరు వాసా నాన్న శివా జగతికి మూలం నీవే శివా
అరుణాచల రమణావతారం నీలో సృష్టివ్యవహారం
త్రిమూర్తి రూపా శ్రీనాన్నా కరుణించి మము కాపాడోయి
దర్శనమీయగ రావయ్యా ముక్తికి మార్గము చూపుమయా

ధవళ వస్త్రములు ధరియించి భక్తుల నెల్ల ప్రేమించి
రమణ సన్నిధి నీడలో సద్గురునాన్న రూపములో
కలియుగమందున వెలసితివి ప్రేమ కరుణ పంచితివి
జిన్నూరు గ్రామం నీవాసం భక్తులమదిలో నీరూపం

కలలో రమణుని కలుసుకొని రమణ తత్వమును తెలుసుకొని
అరుణాచలము వెళ్ళితివి రమణ వ్యాప్తినీ చేసితివి
వెలిగించావు జ్యోతులను మా అందరి హృదయములందు
అచ్చెరువొందెను జిన్నూరు మీ జ్ఞాన బోధనలను గాంచి

లక్ష్మి చేసెను నీ సేవ ప్రతిఫలమిచ్చావో నాన్నా
చీకటి లోకం తొలగించి శాంతిలోకం పంపితివి
మానవులందరిని ప్రేమించి నీ ప్రేమతో వారిని కదిలించి
జీవలపైన మమకారము చిత్రమయా నీ వ్యవహారము

నీ ద్వారములో నిలిచితిని నిన్నే నిత్యము కొలిచితిని
అభయమునిచ్చి బ్రోవుమయా ఓ నాన్నీశా దయామయా
ధన్యము జిన్నూరు గ్రామం నీలో నిలిచెను శ్రీ నాన్న
నీ కరుణామయ చూపులకు నశించిపోవును పాపములు

కోరికలే దుఃఖ కారణమని, దుఃఖనివారణకు మార్గముందని
సిద్ధార్థుడు బుద్ధుడైన వైనాన్ని విశదపర్చిన జ్ఞానమూర్తివి
కైలాసములో ఉన్న శివుడే నీ హృదయములో కొలువై ఉన్నాడనీ
కామక్రోధములను వదలమని శాంతి తత్వమును బోధించితివి.

- ॥జిన్నూరువాసా॥

జ్ఞాన నేత్రాలతో మము గాంచితివి భక్తులను నీవు బ్రోచితివి
అజ్ఞానమును అంతముచేసి కాపాడితివి జనులందరిని
క్రీగంటి చూపుతో కన్నీళ్ళను కరిగించి కరుణామయుడిగా వెలిగితివి
కూపస్థమండూకాలను సైతం సాగరతీరము చేర్చితివి.

కరుణాసింధూ కరుణించు మాపై కరుణ కురిపించు
సర్వము నీకే అర్పితము పెంచుము భక్తి భావమును
కొందరికేమో రాముడిగా మరికొందరికేమో కృష్ణుడిగా
రమణుడై మా అందరికి దర్శనమిచ్చిన శ్రీ నాన్నా!

భక్తుల పాలిటి పెన్నిధిగా రాజాయమ్మకు తనయుడిగా
విద్యార్థులకు, వృద్ధులకు అండాదండా నీవేగా
అరుణాచలుని ఆశీస్సులను జనులందరికి పంచితివి
ఆత్మబంధువై మా అందరికి ప్రేమను పంచిన శ్రీ నాన్నా!

రేయి పగలు నీ ధ్యానం నిత్యం నీ ప్రవచనాపఠనం
భక్తితో చేయండి ధ్యానము లభియించును ముక్తికి మార్గం
సద్గురు నీ ప్రవచనాలు నాన్నా మాకవి వేదాలు
శరణని వచ్చిన భక్తులను కాపాడి నీవు బ్రోచితివి.

అందరిలోన నీ రూపం నీ కరుణ అతిశక్తిమయం
ఓ నాన్నా మేము మూఢులం ఒసగుమయా జ్ఞానమును
భక్తికి నీవేనయా మూలం నాన్నా మేము సేవకులం
నాన్న నామము తలచెదము నిత్యము నాన్నను కొలిచెదము.

భక్తిభావన తెలుసుకొని నాన్నను మదిలో నిలుపుకొని
చిత్తముతో శ్రీనాన్న ధ్యానము చేయండి ప్రతినిత్యము
నాన్న చెప్పిన ప్రవచనాలు నివారించును బాధలను
సమాధి నుండి శ్రీనాన్న భక్తులను కాపాడేనోయి

మన ప్రశ్నలకు జవాబులు తెలుపును నాన్న బోధనలు
వినండి లేక చదవండి శ్రీనాన్న సత్యము చూడండి
సత్సంగమమును చేయండి శ్రీనాన్న అనుగ్రహామును పొందండి
బేధ భావనను మానండి శ్రీనాన్నే మన సద్గురువండి

వందనమయ్యా రమణేశా ఆపద్బాంధవ నాన్నీశా
మా పాపములు కడతేర్చు మామది కోరిక నెరవేర్చు
కరుణామూర్తి ఓ నాన్నా కరుణతో మము దయచూడయ్యా
మా మనస్సే నీ మందిరము మా హృదయమే నీకు నైవేద్యం

- ॥జిన్నూరువాసా॥

## మనవి

ఈ ప్రపంచములో నిజమైన ప్రేమ అరుదు. మనం ప్రాపంచిక బంధనాలను సాధ్యమైనంతవరకు తెంచుకుంటే కాని గురువు మీద ప్రేమ తరగదు. ప్రేమలో జీవితాన్ని త్యాగం చేయవలసి ఉంటుంది. ప్రతిఫలం ఆశించకుండా గురువును ప్రేమించాలి. గురువుకు మనము ఇష్టమైతేనే ఆయనను మనం నిరంతరం ప్రేమించగలము. ఆయన నిస్వార్థ ప్రేమకు సాటియైనది ఈ లోకంలో మరొకటి లేదు. గురువు ప్రేమ లభించిననాడు నోరు మూత పడుతుంది. బాహ్య నేత్రాలు మూసుకొనిపోతాయి. మనస్సు శాంతిలో నిశ్చలమవుతుంది. దృష్టి గురుపాదాలలో లీనము అవుతుంది కాని ఆ ప్రేమ రంగు అద్దటానికి హృదయమనే వస్త్రం పరిశుభ్రముగా ఉండాలి. మరి మనందరము ఆ ప్రేమ అందుకోవటానికి మన హృదయాలను పరిశుభ్రము చేయమని ఆయనకి దాన్ని నైవేద్యముగా సమర్పిద్దాము.


**- సెలవు -**

- అమ్మాజీ

గురువైభవము - 2
13-02-2018
శ్రీ రమణ ప్రింటర్స్, విజయవాడ.
ఫోన్: 9985068630

భగవాన్

శ్రీ రమణ మహర్షి



శ్రీ రమణ ప్రింటర్స్

డోర్‌నెం. 26-20-19, స్వామివీధి, గాంధీనగర్, విజయవాడ-3.

99850 68630, 95810 24318